క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ



నిల్వ నీటిని పరిశీలిస్తున్న ,చైర్మన్,కమిషనర్

రాయికల్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు నియంత్రించవచ్చని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం పర్యటించారు. ఇంటింటిని సందర్శిస్తూ నిల్వ నీటిని తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నిల్వ నీటి ద్వారా దోమలతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రమాదేవి, కమిషనర్ చిరంజీవి ఉన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన ఎస్సై



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న ఎస్సై అశోక్

జగిత్యాలక్రైం:రాయికల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అశోక్ మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ విప్ పరామర్శ



భాస్కర్‌రెడ్డిని పరామర్శిస్తున్న విప్

ధర్మపురి: వివిధ సమస్యలతో బాధపడుతున్న పలు కుటుంబాలను మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన గడ్డం భాస్కర్‌రెడ్డి ఇటీవల మోకాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అదే విధంగా ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాలసాని రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల రాజు, సింహరాజు ప్రసాద్ తదితరులున్నారు.

ఎంపీకి ఐఎంఏ వైద్యుల పరామర్శ



ఎంపీ అర్వింద్‌తో ఐఎంఏ డాక్టర్లు

కోరుట్ల: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తండ్రి ధర్మపురి శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, ఎంపీ అరవింద్‌ను ఐఎంఏ డాక్టర్లు మంగళవారం నిజామాబాద్‌లో పరామర్శించారు. రాష్ట్ర ఐఎంఏ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ అనూప్‌రావు, కోరుట్ల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరెంట్ స్తంభాలు, వీధిలైట్లు, డ్రెయినేజీలు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం లాంటి సమస్యలపై ఫిర్యాదు చేయగా తక్షణమే వాటిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, బల్దియా అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: మండలంలోని ముత్యంపేట, కొండగట్టు 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, లంబాడిపల్లి, కొండగట్టు, బల్వంతాపూర్, సర్వాపూర్ గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏడీఈ సీహెచ్.బాలలింగం తెలిపారు.



పెగడపల్లి: మద్దులపల్లిలో సీత్లా భవాని వేడుకల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి



రాయికల్‌లో సీత్లాభవానికి పూజలు చేస్తున్న గిరిజన మహిళలు

ఘనంగా సీత్లాభవాని వేడుకలు

మెట్‌పల్లిరూరల్/రాయికల్/పెగడపల్లి/రాయికల్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/మల్లాపూర్: బంజారాల ఆరాధ్య దైవం సీత్లా భవానీ వేడుకలు మంగళవారం మండలాల్లోని పలు గ్రామాల్లో గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. మహిళలు పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. పెగడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన సీత్లా భవాని వేడుకల్లో ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో లంబాడీల ఐక్యవేదిక అధ్యక్షుడు రమేశ్‌నాయక్, గిరిజన నాయకులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మల్లాపూర్ శివారులో సీత్లాభవానిమాతకు పూజలు చేస్తున్న గిరిజనులు

చెరువుల మరమ్మతు పూర్తి చేయాలి

• కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో దెబ్బతిన్న చెరువుల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంతో గొర్రెపల్లి, రేగుంట గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న చెరువులను, ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా, వర్షకొండ గ్రామాల్లో చెరువులను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. చెరువుల పునరుద్ధరణకు నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్, డీఈ దేవానంద్,ఏఈలు రాకేశ్, సుకన్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తోట శ్రీనివాస్,దశరథ్‌రెడ్డి,నాయకులు పాల్గొన్నారు.



రేగుంటలో పెద్దవాగు మాటుకాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం రూరల్ తహసీల్దార్ రాంమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కర్నె నర్సింహారెడ్డి, నాయకులు రాము, గంగారెడ్డి, విజయ్, సాయికుమార్, ప్రవీణ్, ఆదిత్య పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

రుణమాఫీ ప్రకటించాలని తహసీల్దార్‌కు వినతి

రాయికల్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ప్రకటించిన హామీల్లో రైతురుణమాఫీ, కౌలు రైతులకు రూ.12 వేల పెట్టుబడి సాయం, రైతుభరోసా వంటి హామీలను నెరవేర్చలేదని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుర్మ మల్లారెడ్డి, ప్రేమ్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, బన్న, సంజీవ్, సుధాకర్, కిరణ్, గంగరాజు పాల్గొన్నారు.

పెగడపల్లి:రైతుభరోసా, పంటరుణం మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంకిటి రవీందర్‌రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, మండల ప్రధాన కార్యదర్శి పల్లె మోహన్ రెడ్డి, కొత్తూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ధర్మపురి: మండలంలోని జైనా గ్రామానికి చెందిన ఎక్కొటి బాలవీర్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి స్నేహితులు, దాతల సహకారంతో రూ. 30 వేలు విరాళాలు సేకరించి, బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడిక్యాల మహేశ్, సంగెపు గంగారాం, నాయకులు పాల్గొన్నారు.

18న రాఘవపేటలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో ఈ నెల 18 న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక (లోకల్ కోర్టు) సమావేశం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని గ్రామాల రైతులు, గృహ, వాణిజ్య, వ్యాపార వినియోగదారులు హాజరు కావాలని సూచించారు.

నూతన నియామకం

ధర్మపురి(బుగ్గారం): తెలంగాణ వెనుకబడిన తరగతుల సాధికారిత సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాదినేని రాజేందర్ నియమితులయ్యారు. జగిత్యాల జిల్లాకు చెందిన రాజేందర్ బీసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న రాజేందర్ సేవలను గుర్తించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాని రామకృష్ణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెట్‌కు ఎస్సై సన్మానం

మల్లాపూర్: అండర్-12 రాష్ట్రస్థాయిలో రన్నింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన చిట్టాపూర్‌కు చెందిన గణపతి హర్షవర్ధన్‌రాజ్‌ను మంగళవారం ఎస్సై కిరణ్‌కుమార్ అభినందించి సన్మానించారు. మారుమూల గ్రామం చిట్టాపూర్ నుంచి రాష్ట్రస్థాయి క్రీడల్లో హర్షవర్ధన్‌రాజ్ రాణించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువ పురస్కార్ అవార్డు గ్రహీత విష్ణువర్ధన్‌రాజ్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆదాయపన్ను రద్దు చేయాలి

జగిత్యాల: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని, పాత పెన్షన్ పథకం పునరుద్ధరణకు పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రులకు పోస్టుకార్డులు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో బొల్లం విజయ్, విశ్వనాథం, హన్మంతరెడ్డి, ప్రకాశ్‌రావు, యాకూబ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

చెరువు మరమ్మతు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: వారం రోజుల్లో చెరువు మరమ్మతు పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో తెగిపోయిన చెరువు కట్టను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. చెరువు కట్ట మరమ్మతులకు రూ.11.35 లక్షలు మంజూరైనా ఇంకా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు జెట్టి లింగం, వెంకట్‌రెడ్డి, రాజేందర్, జాన శంకర్ ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద కుల వృత్తులపై ఇస్తున్న ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ఐక్యూ మైండ్స్ కంప్యూటర్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సుఖేందర్, జెట్టి లింగం, బొడ్ల రమేష్, చంద్రయ్య, సీఈవో యాసిన్‌బిస్మిల్లా పాల్గొన్నారు.

మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు

ఇబ్రహీంపట్నం: వాతావరణంలో వస్తున్న మార్పులతో మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశిస్తోందని, రైతులు తొలి దశలోనే నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ లావణ్య తెలిపారు. మండలంలోని డబ్బా గ్రామంలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. సున్నం, ఇసుక 1:9 నిష్పత్తిలో ఎకరానికి 10 కిలోలు మొక్కజొన్న కాండంసుడుల్లో వేయాలని, లేకుంటే ఇమామెక్టిన్, బెంజోయేట్ వంద గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి తీవ్రంగా ఉంటే క్లోరాంత్రనిలిప్రోల్ 0.4 ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలను విన్నారు. పంటల్లో కలుపు మొక్కలపై శాస్త్రవేత్తలు మాధవి, గోన్యానాయక్ రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలునరేశ్, శ్యామ్, హరీశ్ రైతులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామంలో సబ్‌స్టేషన్ మంజూరు కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కాయితి నాగరాజు, ఎం.జీ రెడ్డి, పిడుగు తిరుపతిరెడ్డి, పులి హరిప్రసాద్, సత్యనారాయణ, కృష్ణచారి, జలపతిరెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే

జగిత్యాలక్రైం: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం తప్పదని పట్టణ సీఐ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం సాయంత్రం పోచమ్మవాడలోని నాయుడు చౌరస్తా వద్ద విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. వాహనదారులు వాహనానికి ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మన్మథరావు, నరేశ్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు

ధర్మపురి(బుగ్గారం): మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిపై డ్రంక్అండ్‌డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. బుగ్గారం మండలంలోని చిన్నాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం సీఐ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఇద్దరు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారని తెలిపారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలి'

జగిత్యాలక్రైం: విధులకు హాజరు కాని ఏఎన్ఎంపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల డివిజన్ శాఖ అధ్యక్షుడు కాయితి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట వైద్య ఉప కేంద్రంలో విధులకు హాజరు కాని ఏఎన్ఎం మమతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐదుగురిపై అట్రాసిటీ కేసు

సారంగాపూర్: ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినందుకు దాడి చేసి కులం పేరుతో దూషించిన ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై కుమారస్వామి తెలిపారు. విదేశానికి వెళ్లేందుకు మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మొర్రిగూడకు చెందిన కామెర రాజేశ్వర్ బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన రామకిష్టు గంగాధర్‌కు రూ.7.30 లక్షలు చెల్లించాడు. పదేళ్లయినా పంపించకపోవడంతో డబ్బు తనకు ఇవ్వాలని కోరాడు. గంగాధర్ నిరాకరించగా.. ఈనెల 8న గ్రామస్తులతో కలిసి గంగాధర్ ఇంటికొచ్చి నిలదీశాడు. మరోసారి ఇంటికొస్తే చంపేస్తామంటూ గంగాధర్, ఆయన భార్య, తల్లి, కుమారుడు, గాజర్ల రామచంద్రం రాజేశ్వర్‌ను కులంపేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గంగాధర్, ఆయన భార్య, తల్లి, కుమారుడు, రాంచంద్రంపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై దాడి కేసు నమోదు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన ముత్యాల మురళిపై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామశివారులోని ఎడ్మల వినోద్‌రెడ్డి వ్యవసాయ భూమిలోకి మురళి చొరబడి రాళ్లు పాతే ప్రయత్నం చేశారని, దీనిపై ప్రశ్నించినందుకు మురళి తలపై కొట్టినట్లు బాధితుడు వినోద్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మురళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఫొటో ఫ్లెక్సీలో పెట్టాలి

జగిత్యాల: ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందులో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఫొటో లేకపోవడాన్ని ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సతీశ్, కిషన్ అన్నారు. దళితబిడ్డలను అవమానించే రీతిలో వ్యవహరించడం సరికాదని నాయకులు అన్నారు.

కొడుకు పుట్టాడని అంజన్నకు పొర్లు దండాలు



ఆలయంలో పొర్లు దండాలు పెడుతున్న భక్తుడు

కొండగట్టు: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను నమ్ముకోవడంతో తమకు కొడుకు పుట్టాడని హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆలయంలో మంగళవారం పొర్లు దండాలు పెడుతూ తమ మొక్కు తీర్చుకున్నారు. ఆలయంలో మంగళవారం సాధారణ రద్దీ నెలకొంది.ఈ సందర్భంగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని వెళ్లారు.



■ అలుగు పారుతున్న ఫకీర్‌కొండాపూర్ చెరువు

ఇబ్రహీంపట్నం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ఫకీర్ కొండాపూర్‌లో పెద్ద చెరువు నిండి అలుగుపారుతోంది. యామాపూర్, ఫకీర్ కొండాపూర్ దారిలో హై లెవల్ వంతెన నిర్మాణ దశలో ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు పక్కనే తాత్కాలిక రోడ్డు నిర్మించారు. నీటి ప్రవాహానికి బైపాస్ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

భీమారంలో ఆగని క్షుద్ర పూజలు

మేడిపల్లి: భీమారం మండలం మూఢనమ్మకాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. మొన్న భీమారం ఉదంతం మరవకముందే మంగళవారం హైస్కూల్ సమీపంలో రెండుచోట్ల ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, బొట్టు, నిమ్మకాయలు, మైనంబొమ్మ, పూజాసామగ్రి, చిల్లర డబ్బులు, కొబ్బరికాయలు, నల్లకనుము, గాజులు, పెట్టి క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు ఉండడంతో విద్యార్థులు, గ్రామస్తులు బెంబేలెత్తిపోయారు. అసలు ఈలాంటి అశాంఘిక కార్యకలపాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ వారికి సమాచారం అందించగా వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో నిఘా ఉంటుందన్నారు. క్షుద్రపూజలు అనేది వట్టి మూఢనమ్మకం అని ఎవరు వాటిని నమ్మవద్దన్నారు. త్వరలో అవగాహన కార్యక్రమాలు చేపడతామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.



హైస్కూల్ సమీపంలో క్షుద్రపూజల ఆనవాళ్లు

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోరుట్ల: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. పట్టణంలో మంగళవారం ఉదయం పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. ఇంటి ఆవరణలో నిల్వ నీటిని ఉంచుకోకూడదని, చుట్టూ ఎలాంటి చెత్తాచెదారం ఉండకుండా చూడాలని, పాత కుండీలు, కొబ్బరి చిప్పలు, మూత పెట్టని నీళ్ల కుండీలు ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతీ ఆదివారం పది నిమిషాలు డ్రై డేను పాటించాలని సూచించారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ధర్మపురి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మున్సిపల్ అధికారులు మంగళవారం ప్రత్యేక చర్యలు చేపట్టారు.పట్టణంలోని 1వ, వార్డులో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పూడికతీత, ఖాళీ డ్రమ్ములు, నీరు నిల్వ ఉండకుండా పారబోయించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, కౌన్సిలర్లు, మెప్మా, టీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వనమహోత్సవం

కోరుట్ల రూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్‌లో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో రామకృష్ణ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి గంగుల నరేశం, పంచాయతీ కార్యదర్శి అనూష,పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వనమహోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రాజారెడ్డి, ఎంపీవో కృపాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో కొమురయ్య, టీఏ వినోద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సారంగాపూర్: వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో లచ్చాలు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ పాఠశాలల వద్ద మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్సై దత్తాద్రి, అటవీశాఖ డెప్యూటీ రేంజర్ రవికుమార్, హెచ్‌ఎం కిషోర్‌పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్‌లో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. గౌడ సంఘం సభ్యులతో కలిసి అధికారులు ఈత మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో షౌకత్‌అలీ,డీఎఫ్ఆర్‌వో హఫీజొద్దిన్,ఇంచార్జ్ ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ నృసింహుని ఆలయంలో చోరీ

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ ఈవో వెంకన్న కథనం ప్రకారం.. దొంగలు సోమవారం అర్ధరాత్రి ఆలయ తాళాలు పగుగొట్టి, ఉత్సవమూర్తులు, మూలవిరాట్టుపై ఉన్న 58 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. సుమారు 10 కిలోల వెండి వస్తువులను ముట్టుకోలేదు. మంగళవారం తెల్లవారుజా మున ఆలయాన్ని శుద్ధి చేయడానికి వచ్చిన సిబ్బంది గర్భగుడి తలుపులు పగులగొట్టి ఉండటంతో అర్చకులకు విషయాన్ని తెలిపారు. వారు అక్కడికి చేరుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం 10 గంటలకు ఆలయానికి వచ్చిన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. పోలీస్ డాగ్ ఆలయం చుట్టూ తిరిగి, వేములవాడ దారివైపు వెళ్లి, ఆగిపోయింది. ఆలయంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, ఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కాగా, పెట్రోలింగ్ పోలీసులు గుడి ఎదుట ఉండగానే చోరీ జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం

జగిత్యాల: కేవలం ఐదుగురితో మొదలై జాతీయవాద భావాలతో విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తూ ఈరోజు ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ఆవిర్భవించిందని, సామాజిక సమరసత ప్రముఖ్, సీనియర్ జర్నలిస్ట్ బెజ్జంకి సంపూర్ణచారి అన్నారు. మంగళవారం ఇందిరాచౌక్‌లో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలే కాకుండా విపత్తులు సంభవించినప్పుడు ముందుంటూ దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములు అవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సాయికుమార్, కుందారపు రాజు, శ్రీనివాస్, మనోహర్,తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

కోరుట్ల: అఖిల భారత విద్యార్థి పరిషత్ 76వ ఆవిర్భావ వేడుకలు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మాడవేణి సునీల్, ఎస్ఎఫ్ఎస్ విభాగ్ కన్వీనర్ పవన్, సంజీవ్, మహాదేవ్, వికాస్, మణిదీప్, మనీష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలతో పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలే ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జానపద రచయిత మధుకు సత్కారం

జగిత్యాల: తెగిపడ్డ నింగి చుక్కలం అనే పాటతో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రముఖ జానపద రచయిత, గాయకుడు మురళీ మధు జగిత్యాలకు రాగా కళాకారులు ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన మధు ఉమ్మడి జిల్లా వాసి కావడం ఎంతో అభినందనీయమన్నారు.